- జిల్లాలో 28,763 మంది కౌలు రైతులు
- పంటలు సాగు చేస్తున్నా దక్కని భరోసా
- ఆత్మీయ భరోసాకు నోచుకోని అన్నదాతలు
- అనాలోచిత విధానాలతో దిక్కుతోచని స్థితి
- అప్పుల బాధ భరించలేక పలువురు రైతుల ఆత్మహత్యలు



కష్టాల్లో కౌలు రైతులు

ఆదిలాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా సాగునే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కౌలు రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారిన తమ తలరాతలు మారడం లేదంటూ ఆవేదన వ్యక్తమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కౌలు రైతుల దరికి చేరడం లేదు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేరక పోవడంతో ఎదురు చూడాల్సి వస్తోంది. జిల్లాలో 21 మండలాల పరిధిలో 509 రెవెన్యూ గ్రామాలలో సుమారుగా 28వేల 763 మంది కౌలు రైతులు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకానికి కౌలు రైతులు దూరమవుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకానికి కూడా నోచుకోలేదు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పిన ఆచరణ సాధ్యం కావడం లేదంటున్నారు. మళ్లీ భూమి పట్టా కలిగి ఉన్న రైతులకే పెట్టుబడి సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. రాత్రనక, పగలనక పంటలను సాగుచేస్తున్న కౌలు రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఎలాంటి సహాయానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. గతంలోనే కౌలు రైతులకు కూడా రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందించాలనే డిమాండ్లు వచ్చాయి. దీంతో ప్రభుత్వం పరిశీలిస్తామని ప్రకటించింది. అయినా ఇప్పటివరకు పెట్టుబడి సహాయంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కౌలు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

కఠిన నిబంధనలు

భూమి లేని నిరుపేద రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించింది. అయితే ప్రభుత్వం దీనికి కఠినమైన నిబంధనలు విధించడంతో వేల మంది కౌలు రైతులు ఆత్మీయ భరోసాకు దూరమవుతున్నారు. కొంతమంది రైతులకు దక్కే అవకాశం ఉన్నా ఇప్పటివరకు ఆత్మీయ భరోసా ఊసేత్తడమే లేదు. ఈ పథకాన్ని ప్రభుత్వం లాంచనంగా ప్రారంభించింది. కానీ కౌలు రైతులకు భరోసా అందడం కష్టంగానే కనిపిస్తోంది. ఎందుకంటే గ్రామాల్లో ఎకరం ఆలోపు భూమిని కలిగి ఉన్న చిన్న సన్నకారు రైతులే ఎక్కువగా సాగు భూములను కౌలుకు తీసుకొని పంటలను సాగు చేస్తారు. అయితే గుంట భూమిని కలిగి ఉన్న ఆత్మీయ భరోసా వర్తించదని అధికారులు చెబుతున్నారు. దీంతో దాదాపుగా ఈ పథకానికి కూడా కౌలు రైతులు దూరమైనట్లుగానే కనిపిస్తోంది. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోను కౌలు రైతుల జోలికి వెళ్లినట్లు కనిపించ లేదు. అయితే జిల్లాలో ఎక్కువగా కౌలు రైతులే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 1 జనవరి 2025 నుంచి ఇప్పటి వరకు ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు వాతావరణ పరిస్థితులకు తోడు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేక పోవడంతో దిక్కుతోచని స్థితిలోనే రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



సాగు పనుల్లో నిమగ్నమైన రైతు

గత్యంతరం లేకనే పంటల సాగు

వ్యవసాయం తప్ప మరే రంగంలో పరిజ్ఞానంలేని కౌలు రైతులు గత్యంతరం లేకనే పంటలను సాగు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించడంలో నిండు నిర్లక్ష్యం వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే అటవి భూములపై హక్కులు పొందిన రైతులతో పాటు అసైన్డ్ భూములు, ఏజెన్సీ భూములను కలిగి ఉన్న రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నారు. కానీ కౌలు రైతులకు ఎలాంటి ఆధారం లేదన్న సాకుతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కనీసం బ్యాంకు రుణాలకు కూడా నోచుకోవడం లేదంటున్నారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో సాగులో యేటా నష్టాలే మిగులుతున్న గత్యంతరం లేని పరిస్థితుల్లోనే వ్యవసాయంపై ఆధారపడాల్సి వస్తుందంటున్నారు. ఫసల్ బీమాను అమలుచేయక పోవడంతో పంట నష్టపరిహారం కూడా దక్కడం లేదు. అసలే అంతంత మాత్రంగా ఉన్నా కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక పోవడంతో కనీసం కౌలు చెల్లించే పరిస్థితి లేదంటున్నారు. మళ్లీ కౌలు డబ్బులను చెల్లించేందుకు కూడా అప్పులే చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

గతిలేకనే ఆత్మహత్యలు

పంటల సాగులో నష్టాలు, కుటుంబ పోషణ, అప్పుల భారం పెరిగి పోవడంతో గత్యంతరం లేక కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గుంట భూమిలేక పోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఉసురు తీసుకుంటున్నారు. ఇటీవల ఉట్నూర్ మండలం సేవాదాస్‌నగర్ గ్రామానికి చెందిన రాథోడ్‌గోకుల్,తలమడుగు మండలం సుంకిడి గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న, నేరడిగొండ మండలం వడూర్ గ్రామం ఈదపుపోశెట్టి దంపతులు ఆత్మహత్యలకు (మిగతా 6వపేజీలో..)



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పాఠశాలల్లో పరిశుభ్రతపై హెచ్‌ఎంలు దృష్టిసారించాలి: కలెక్టర్

జైనథ్, జూలై3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు పాఠశాలల పరిశుభ్రతపై సంబంధిత ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు దృష్టి సారించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు.గురువారం మండల కేంద్రమైన జైనథ్‌లో గల ప్రభుత్వ కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని అకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాల స్థితిగతులపై కళాశాల ప్రత్యేక అధికారి వీణాకుమారిని అడిగి తెలుసుకున్నారు.పాఠశాల విద్యుత్, తాగునీరు గదుల నిర్మాణాన్ని మరిన్ని నిధులను మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని, ఐరన్ మాత్రను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనాన్ని కలెక్టర్ రాజార్షిషా ఆరగించారు. పలు అంశాలను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైనథ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ నైనత, కేజీబీవీ ప్రత్యేక అధికారి వీణాకుమారిలతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

రిమ్స్ శానిటేషన్ కాంట్రాక్టర్‌పై వేటు

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆసుపత్రిలో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీపై వేటు వేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14న కలెక్టర్ రాజార్షిషా గురువారం రిమ్స్ ఆసుపత్రిని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీకి షోకాజ్ నోటీసులు అందించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, అలాగే జూన్ 27న ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు రిమ్స్ ఆసుపత్రిని ఆకస్మీకంగా తనిఖీ చేసిన సమయంలోనూ పారిశుధ్య నిర్వహణా లోపం కనిపించింది. దీంతో ఇన్‌చార్జీ మంత్రి సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల బాగోగులతో పాటు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సంబంధిత కాంట్రాక్టర్ వినకపోతే వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జీ మంత్రి ఆదేశాలతో కృష్ణ కన్‌స్ట్రక్షన్ (హన్మకొండకు చెందిన) ఏజెన్సీని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

35వేల నోటు పుస్తకాల పంపిణీ

ఉట్నూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేస్తోంది. ఇందులో భగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం మండల విద్యాధికారి ఆశన్న ఆదేశాల మేరకు సీఆర్పీ ప్రవీణ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు 35వేల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మండల పరిషత్ ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్‌ఆధ్వర్యంలోని ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులకు ప్రభుత్వ ప్రయోజనం చేకూరిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణలు

ఉట్నూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెలకొల్పిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళల కోసం రెండు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఈ నెలలో ప్రారంభిస్తున్నామని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటి) డైరెక్టర్ మొహమ్మద్‌గౌస్ తెలిపారు.ఈ నెల 19నుంచి వస్త్ర చిత్రకళ లఘు ఉద్యమి (మగ్గంవర్క్) 31 రోజుల శిక్షణ, 23 నుంచి బ్యూటీ పార్లర్ 35 రోజుల శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని మహిళలు మున్సిపల్ పరిధిలోని వారు కాకుండా శిక్షణ పొందవచ్చని తెలిపారు. అన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి భోజన సౌకర్యం కల్పించి యూనిఫాం అందిస్తామన్నారు. కార్యక్రమంలో లగేజీతో 19, 23 తేదీలలోఆయా శిక్షణ పొందే వారు నేరుగా రావాలన్నారు.

బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ కోకన్వీనర్‌కు సన్మానం

ఉట్నూర్,జూలై3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గం కో కన్వీనర్‌గా నియమితులైన ఆరెల్లి రాజలింగుని ఉట్నూర్ మండల్‌భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠం చేయడానికి కృషి చేయడంతో పాటు కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బింగి వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోలిపాక రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల ఉపాధ్యక్షులు అర్జున్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ దావులబాలాజీ, సీనియర్ నాయకులు సాడిగే రాజేశ్వర్, ఉష్కమొల్ల దేవిదాస్, పుల్లిశ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఆరెల్లి రాజలింగును సన్మానిస్తున్న నాయకులు



భూమి పూజ చేస్తున్న నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్, జూలై3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందని కాంగ్రెస్ యువ నాయకులు దళిత రత్న అవార్డు గ్రహీత కోరేలా మహేందర్ అన్నారు. గురువారం బాలాజీనగర్ కాలనీలో లబ్ధిదారులు ఆడె సరస్వతి ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసి, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉండకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వారి వెంట కార్యదర్శి మోతిరామ్, ప్యాక్స్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, వసంత్ ఆడె, గుంజ చిన్న, దిగంబర ఆడె, అవినాష్ ఆడె ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బోథ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే ఏకపేడు మాకే నామ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్ పేర్కొన్నారు. గురువారం సహకార సంఘం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏవో రవితేజ, సహకార బ్యాంక్ మేనేజర్ శైలజలు మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ జలాల్, సీఈఓ గోలి స్వామి, పీఏసీఎస్ సిబ్బంది ప్రణీత్, అనిల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మొదలైన పీర్ల ఉత్సవాలు

తలమడుగు, జూలై3 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యాలకు అతీతంగా జరుపుకునే మొహరం ఉత్సవాలు తలమడుగులో ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా రుయ్యాడిలో పీరీలకు ఘనమైన చరిత్ర ఉండడంతో ఇక్కడ పండుగను గ్రామస్తులంతా కలిసి ఘనంగా నిర్వహిస్తారు. గ్రామంలోని హసేన్ హుసేన్ ఆలయం వద్ద గుండము తవ్వి అందులో నిప్పులు ఏర్పాటుచేసి గుండం చుట్టూ ప్రతీరోజు రాత్రి అచ్చదుల హారతి అంటూ కోలాటం ఆడుతారు. గురువారం పీరీలను ఒంటి బట్టపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కుడ్మేత మనోహర్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ఇంద్రవెల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని హీరాపూర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. వర్షకాలంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తి గత శుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ వసతి గృహాల్లో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలో గురువారం ఆరోగ్యపాఠశాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశానుసారం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని, ఇందులో మాదకద్రవ్యాల వల్ల జరిగిన నష్టం వ్యక్తిగత పరిశుభ్రత పౌష్టికాహారం తదితర అంశాలపై బోధించడం జరుగుతుందన్నారు. కనుగుట్ట గ్రామంలో ఉపాధ్యాయులు ఆరోగ్య పాఠశాల గురించి వివరించారు. ప్రతిరోజు ఉదయం పూట 20 నిమిషాల పాటు తిరగడం జరుగుతుందని కనుగుట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతి విద్యార్థి బోధించిన విషయాలను గుర్తించుకొని ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బాడాల శ్రీకాంత్ రెడ్డి, గౌరవాధ్యక్షులు ఎం. గంగయ్య, వీడీసీ ఉపాధ్యక్షుడు మేర రమణయ్య, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నోముల బాపురెడ్డి, గ్రామ నాయకులు కొంకటి గంగాధర్, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కనుగుట్టలో ఆరోగ్య పాఠశాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న డీఐఈవో జాదవ్ గణేష్‌కుమార్

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

- డీఐఈవో జాదవ్ గణేష్‌కుమార్

నేరడిగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను డీఐఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ మోహసిన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ షబానా తర్జం, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఇంద్రవెల్లిలో జాబ్‌మేళా

ఉట్నూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం మినీ జాబ్ మేళా ఏర్పాటుచేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌మేళా ఉదయం 10నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. వివరాల కోసం 9010295910, 96667 48105, 949353 5052 సంప్రదించాలని పేర్కొన్నారు.

జీవో 49 రద్దు కోసం ఆదివాసీ సంఘాల సంఘటిత పోరాటం

- జీవో రద్దు చేయాలంటూ ఆదివాసీ సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ఉట్నూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొమురంభం ఆసిఫాబాద్ ప్రాంతంలో కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్టు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సంఘటిత పోరాటం చేస్తామని ఆదివాసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదిలాబాద్ జిల్లా తుడందెబ్బ అధ్యక్షుడు పెందూరుదాదిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడంగణేష్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు, అటవీ హక్కులు కలిగి ఉన్నారని అన్నారు. ఇప్పటికే కవ్వాల్ టైగర్‌జోన్ ఏర్పాటుతో గిరిజన గూడాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మళ్లీ ప్రభుత్వం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జీవో 4 9 అమలు చేస్తూ ఆదివాసీ గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడానికి పూనుకుందని అన్నారు. సమావేశంలో తుడందెబ్బ సంక్షేమ పరిషత్, గోండువాన పంచాయితీరాయిసెంటర్, ఆదివాసీ సేన, జై ఆదివాసీ యువశక్తి, ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ సమాఖ్య, ఆదివాసీ ఉద్యోగుల సంఘం, రాజ్‌గోండ్ ఉద్యోగుల సంఘం, రాజ్గఓండు సేవా సంఘం, పర్దాన్ పురోహిత్‌సేవా సంఘం, బిరుదుగోండ్‌తోటి సేవా సంఘం, ఆదిమ కోలాం సేవా సంఘం, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గోడం గణేష్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: ఎమ్మెల్యే

మావల/ఆదిలాబాద్ అర్బన్, జూలై3 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టైలర్స్ కాలనీ, సంజయ్‌నగర్, పోలీసు కాలనీ తదితర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలోని మెజార్టీ వార్డులలో రోడ్లు, మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్‌లో విలీనమైన వార్డుల పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ వస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశించినా జరగలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, రవిరెడ్డి, శరత్, సూర్య కిరణ్, శివ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

'కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలిరావాలి'

ఆదిలాబాద్, జూలై3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించే కాంగ్రెస్‌పార్టీ బహిరంగ సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీని బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో సవారిల సందడి


ఏజెన్సీ గ్రామాల్లో ఊరేగిస్తున్న సవారీలు

ఉట్నూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో సవారిల సందడి జోరు అందుకుంది. గిరిజనులతో పాటు గిరిజనేతరులు మొహరం పండుగ సందర్భంగా గిరిజన గ్రామాల్లో సవారీలను ఏర్పాటు చేసుకుని ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఆశన్న, ఊశన్న, హస్సేన్, హుస్సేన్‌ల పై పాటలు పాడుతు సవారీల గుండాల వద్ద భక్తులు సందడి చేశారు.

బజార్‌హత్నూర్ : గ్రామాల్లో మత సామరస్యానికి ప్రతికగా భావించే పీరీల పండుగ ప్రారంభమయింది. బజార్‌హత్నూర్ మండల కేంద్రం, దేగామ, కొల్హారి, పిప్పిరి,గిర్నూర్, గోకొండ,జాతర్ల మోర్ఖండితో పాటు ఆయా గ్రామాల్లో పీరీల ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. కర్బల, మౌలాలి, నాలె హైదర్, ఆలీఅబ్బాస్ తదితర పేర్లున్న పీరీలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తారు.

కనక హాయతికి రూ.60 వేల ఆర్థిక సహాయం

ఉట్నూర్, నార్నూర్, జులై 03 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడి టీం అధ్యక్షులు కనక సుదర్శన కూతురు కనక హయతి ఆరోతరగతి విద్యార్థి కొన్ని రోజులు నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. సంబంధిత విషయంపై స్పందించిన అభిమన్యు సేవా సంఘం ద్వారా దాతలు ఇచ్చిన ఆర్థికనిధి రూ.60 వేలను వ్యవస్థాపక అధ్యక్షులు మెస్రం శేకర్ బాబు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రాయి సెంటర్ సార్ మెడి మెస్రం దుర్గు పటేల్ చేతుల మీదుగా ఆత్రం సుగుణక్క కుటుంబం సభ్యులకు అందించారు. వారి వెంట కనక రామారావు, దేవేందర్, భుజంగరావు ఉన్నారు.

బాధిత రైతు కుటుంబానికి గొర్రెల పంపిణీ

ఆదిలాబాద్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసారి గ్రామానికి చెందిన సిరిపురే వసంత్ అనే కౌలు రైతు గత మూడు సంవత్సరాల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ వారి ఆర్థిక సహకారంతో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపుబొర్రన్న ఆధ్వర్యంలో గురువారం రూ.40వేల విలువ గల నాలుగు గొర్రెలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఆవుల రాకేష్, గణేష్, స్వామి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం బారులు


బారులు తీరిన రైతులు

బజార్ హత్నూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో రైతులు బారులు తీరారు. ఇప్పటి వరకు 13,320 బ్యాగుల యూరియా, డీఏపీ ఎరువులు అందించగా గురువారం 888 బస్తాలు పంపిణీ చేశారు. ఒక్కో ఆధార్‌కార్డుకు ఐదుబస్తాల చొప్పున అందించగా కొంతమంది దొరకని వారు వెనుదిరగాల్సి వచ్చింది.

రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, కో-ఆపరేటీవ్ శాఖ అధికారులతో కలెక్టర్ రాజార్షిషా గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యూరియా, రైతులకు అందుబాటులో ఉంచేలా చూడాలని అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ప్రతిరోజు ఎరువుల దుకాణాలు 7.30 నుంచి 8 గంటల మధ్య తెరిచి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణాల ముందు రైతులు లైన్లు కట్టేవరకు వేచి చూడకూడదని, ప్రైవేట్ డీలర్లు లేని మండలాల్లో, పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కే దుకాణాలలో సరిపడ ఎరువుల నిల్వలు ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.


టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి సారించాలి

ఆరోగ్య పాఠశాల ఉన్నత భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు రెండోవిడత కార్యక్రమాన్ని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రణదివ్యనగర్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరుసూత్రాలపై రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గురువారం రణదివ్యనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన టాయిలెట్స్ సానిటరీ నాప్కిన్ మిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు సైకిల్స్‌ను అందజేసి మొక్కలను నాటారు. ఇందులో విద్యాధికారి శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లక్ష్మణ్, ఆర్ఎం రాంచందర్‌రావు, లీడ్‌బ్యాంక్ మేనేజర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ :జిల్లాలోని ఆయా గ్రామాల రైతులు తమ పంటల అవసరం మేరకే యూరయా, డీఏపీ ఎరువులను వాడాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం మండల కేంద్రమైన జైనథ్ సహకార సంఘం కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు.

బస్‌టికెట్ల చార్జీలు పెంచడం దారుణం

● బీఆర్ఎస్ నాయకులు


మాట్లాడుతున్న మజర్

నేరడిగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జిలపై బీఆర్ఎస్ సోషల్‌మీడియా నాయకుడు మజర్ తీవ్రంగా ఖండించారు. గురువారం మజర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి మహిళల టికెట్లను మగవారిపై వసూళ్ళు చేస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వరకు గతంలో రూ.30 ఉన్న టికెట్‌ను ఇప్పుడు ఏకంగా రూ.20 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారని, ఇది మహిళల పేరిట ఉచితం అని మగవారి దగ్గర ఇద్దరి డబ్బులను వసూళ్ళు చేస్తున్నారని అన్నారు. ఒక్క ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వరకే రెండు వందల మంది ప్రయాణీకులు అయితే ఆదిలాబాద్ జిల్లాలో ఎంత మంది ప్రయాణీకులు ఉన్నారు. రాష్ట్రం మొత్తంలోఎంత మంది ప్రయాణీకులు ఉన్నారు. ఇలా రాష్ట్రమంతట ఎన్నో కోట్ల భారం అమాయకమైన ప్రయాణీకుల మీద వేస్తుందని అన్నారు.

ముఖ్యమంత్రిని కలిసి జీవో 49పై కమిటీ


సమావేశంలో పాల్గొన్న మంత్రులతో ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్,జూలై3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసులు ఆందోళన చేస్తున్న జీవో 49పై ముఖ్యమంత్రితో చర్చించి కమిటీ వేశామని అటవీశాఖ మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం జీవో 49పై జరిగిన రివ్యూ మీటింగ్‌లో నిర్ణయించామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన ఫారెస్టు ఉన్నత అధికారుల రివ్యూమీటింగ్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రివర్యులు జూపల్లికృష్ణారావు ఆదివాసులకు ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఊరు బాగు కోసం పాటుపడండి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపు

బోథ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పుట్టిపెరిగి ఉన్నతులుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని యువకులు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కౌటాభి గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. యువత చెడుమార్గంలో పయనించవద్దని యువతను మార్చేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తుంటారన్నారు. యువకులు దురలవాట్లు దూరంగా ఉండి తల్లిదండ్రులను మార్చాలని వారు మత్తు పానియాలకు దూరంగా ఉండేవిధంగా చూడాలన్న ఇంటికి వెళ్ళగానే డ్రగ్స్ వల్ల జరిగే అనర్ధాలను వివరించాలని కోరారు. నేరమని విషయాన్ని రైతు కుటుంబాలు పుట్టిన వారు వివరించాలని పేర్కొన్నారు. రైతుబంధు వర్తించదనే విషయాన్ని వివరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో గంజాయి సాగు చేసిన రైతులకు రైతు భరోసా,


కౌటాభి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ

రైతు బీమా వర్తించడం లేదని విషయం వివరించాలన్నారు. డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వివేకానంద యూత్ సభ్యులు అబ్దుల్ గండి, సోమేశ్వర్, పృథ్వితో పాటు రమణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా గ్రామస్తులు ఎస్పీ, డీఎస్పీలను శాలువాతో సన్మానించారు.

కష్టాల్లో కౌలు రైతులు..

(5వ పేజీ తరువాయి)

పాల్పడడం అప్పుల భారమేనని తెలుస్తుంది.

కలిసి రాని కాలంతో పంటలు నేలపాలైన పంట నష్ట పరిహారం చేతికందడం లేదు. సరిపడ కౌలును చెల్లిస్తున్న భూ యజమానులు కౌలు రైతులతో ఒప్పందం చేసుకునేందుకు వెనుకాడడంతో ఎలాంటి ఆధారం లేక ప్రభుత్వపథకాలకు దూరమవుతూనే ఉన్నారు. ఎకరాన రూ.10వేల నుంచి రూ.35 వేల వరకు కౌలు చెల్లించిన పెట్టుబడి సహాయం, భీమాసొమ్ము నష్ట పరిహారం యజమాని చేతిలోకే వెళ్లి పోతుంది. కనీసం కౌలు చట్టాలను అమలు చేస్తే కొంత వరకైనా మేలు జరిగే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

● సంగెపుబొర్రన్న (రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్)

కష్టాల్లో ఉన్న కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. కౌలు రైతుల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్న ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. దిక్కుతోచని స్థితిలోనే కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు రైతుభరోసా, నష్ట పరిహారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించింది. అయినప్పటి వరకు అమలు చేయడం లేదు. కౌలు రైతుల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. అసలు కౌలు రైతులను ఎవరు పట్టించుకోవడం లేదు. పంటలను సాగుచేసే ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

బోధనభ్యాసన సామగ్రితో గుణాత్మక విద్య


సామగ్రిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

మావల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుణాత్మక విద్యను అందించడంలో బోధనాభ్యాసన సామగ్రి దోహదం చేస్తుందని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోలా కిరణ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో బోధనభ్యాసన సామగ్రి మేళాను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బోధన అభ్యసనాల సామగ్రితో విద్యార్థులకు బోధనను సులభతరం చేయడానికి, అభ్యసనం ఆసక్తికరంగా మార్చడానికి ఛాత్రోపాధ్యాయులకు ఉపయోగపడుతుందన్నారు. మేళాలో డైట్ అధ్యాపకులు విజయ లక్ష్మి, గంగా మణి, ప్రియాంక, శివకుమార్, సాగరిక పాల్గొన్నారు.

'పొలానికి కాదు బడికి రండి'


విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

నార్నూర్, జులై 03 (ఆంధ్రజ్యోతి) : బడికి రావాల్సిన విద్యార్థులు పొలంలో పనులు చేస్తుండగా ప్రధానోపాధ్యాయులు వెళ్లి మాట్లాడారు. భీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాధాకృష్ణ మూర్తిస్వయంగా సిబ్బందితో కలిసి బాబే ఝరి, రోమన్ కాస తదితర గ్రామాలకు వెళ్లి వారి తలిదండ్రులతోపాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బడికి రావాల్సిందేనని కోరారు. గురువారం ఆరోగ్య పాఠశాల నిర్వహించారు.

టీబీ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి

సిరికొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీబీ (క్షయ) రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.హిమబిందు రాథోడ్ అన్నారు. గురువారం టీబీ నియంత్రణ అధికారి డా.సుమ లతతో కలిసి ఆమె పీహెచ్‌సీ నర్సాపూర్ పరిధిలో గల 75 మంది రోగులకు టీబీ పరీక్షలు నిర్వహించారు.

డీసీసీ అధ్యక్షుడిని పరామర్శించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి

నిర్మల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జ్వరంతో అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు.

కడెం ఎస్సైని కలిసిన నాయకులు

కడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కడెం సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీక రించిన సాయి కిరణ్‌ను కడెం పట్టణ అధ్యక్షులు వాజీద్ ఖాన్ కాంగ్రెస్ నేతలతో కలిశారు. ఎస్సైకి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు బ్రహ్మాచారి, షర్ఫోద్దీన్, అజ్మీరా చందు నాయక్, బైరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు : పంచాయతీ కార్యదర్శి

ముథోల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ అనుమతి లేని నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అన్వర్‌అలీ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గ్రామంలో నూతనంగా నిర్మా ణాలు చేపడుతున్న వారు విధిగా సరైన పత్రాలతో అనుమతి కోసం దరఖాస్తు చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతి ఇచ్చిన తర్వాతనే ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని పేర్కొ న్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేని నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుం టామని స్పష్టం చేశారు. ఇప్పటికే తమ సిబ్బంది వార్డుల వారీగా అను మతి లేని నిర్మాణాలను గుర్తించి జాబితాను సైతం సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి విధిగా ఇంటి పన్ను సైతం చెల్లించాలన్నారు.

సీడీపీవోకు అంగన్‌వాడీల సమ్మె నోటీస్

ముథోల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం సీడీపీవో సరోజినికి తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నెల 9 నుంచి న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న సమ్మెకు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రజియా బేగం, రేష్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన విద్యాధికారి

లోకేశ్వరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి జే.పరుశురాం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట కళాశాల ప్రిన్సిపాల్ కే.గౌతం అధ్యక్షతన అధ్యాపకుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ గురించి ఆరా తీశారు. వీలైనంత వరకు పల్లెల్లో పదో తరగతి పూర్తిచేసి ఖాళీగా ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశ ప్రక్రియను మరింత పెంచాలన్నారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ కే. గౌతమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పర్యావరణపై అవగాహన అందించాలి'

బాసర,జూలై03(ఆంధ్రజ్యోతి) : పర్యావరణంపై అవగాహన కలిగించడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రొఫెసర్లు తెలిపారు.రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) బాసర విద్యార్థుల మాసపత్రిక ద స్టూడెంట్ మ్యాగజైన్ సంచికను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథితులుగా ఆర్జీయూకేటి వీసీ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, ఓఎస్డీ, ఏఓ మురళీదర్శన్ మొదటి సంచికను విడుదల చేశారు. పత్రికలో విద్యార్థుల కథనాలు, రచనలు, విజయాలు, వారి వినూత్న ఆవిష్కరణలు, సంఘ సేవా కార్యక్రమాలు మొదలైన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ.. ప్రతినెలా ఈ మాస పత్రికను విడుదల చేస్తామని చెప్పారు.

లక్ష్మణచాందలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

లక్ష్మణచాంద, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని అవసరమైన సదుపాయాలు, మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచి, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. అనంతరం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, తరగతుల పరిస్థితి, మిడ్డే మీల్, ఉపధ్యాయుల హాజరు, విద్యార్థుల విద్యాస్థాయి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లీష్, గణిత పాఠాలు చెప్పించి వారిని ప్రోత్సహించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. వన మహోత్సవంలో విద్యార్థుల భాగస్వామ్యం పెంచాలన్నారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు పోషకాహారం,


మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

బొమ్మల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రోమోర్ ఎరువుల దుకాణంలో నిల్వలు, రిజిస్టర్లు, విక్రయ వివరాలను తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు, మందులు విక్రయించకూడదని ఆదేశించారు. జిల్లలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై నెలకు అవసరమైన 9,000ల మెట్రిక్ టన్నుల యూరియాకు గాను ఇప్పటి వరకు 8,800ల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు ఎరువులు సమయానికి అందేలా మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో పంపిణీ కొనసాగుతోందన్నారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత షాపులపై చర్యలు తీసుకోవడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు ఎరువుల సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాధికారి రామారావు, జిల్లా వైద్యాధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి అంబాజీ, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంఈవో అశోక్ వర్మ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో ఎరువుల దుకాణాల తనిఖీ

నర్సాపూర్(జి), జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రమేష్ ఫర్టిలైజర్ షాపులో గురువారం తహసీల్దార్ శ్రీకంత్, మండల వ్యవసాయ అధికారి రామచంద్ర నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి కొరత లేదని భరోసా కల్పించారు. ఈ తనిఖీల్లో భాగంగా పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ ద్వారా ఆధార్ కార్డు అనుసంధానంతో యూరియా కొనుగోలు చేసిన రైతుల వివరాలను, విక్రయాల రికార్డులను నిశితంగా పరిశీలించారు. గోదాములో ఉన్న భౌతిక నిల్వలను తహసీల్దార్ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులకు అనుగుణంగానే నిల్వలు ఉన్నాయని, ఎలాంటి అవకతవకలు లేవని ఆయన ధ్రువీకరించారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ... నర్సాపూర్ మండలంలోని రైతులు యూరియా కొరత గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మండలంలోని రాంపూర్, టెంబరేని, చాక్‌పల్లి, గొల్లమాడ వంటి ప్రధాన గ్రామాల్లో ఉన్న అన్ని ఫర్టిలైజర్ షాపులలో రైతులకు అవసరమయ్యే యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడ కొరత లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి రామచంద్ర నాయక్, నర్సాపూర్ ఎస్సై గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్యాల గణేష్, రమ్య, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కే.నవనీత

భైంసా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భైంసా జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పట్టణానికి చెందిన అడ్వొకేట్ కే. నవనీతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన కే. నవనీత గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సేషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి, భైంసా జూనియర్ సివిల్ జడ్జి దేవేంద్రబాబులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజీపీ నవనీత మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో తన సేవలను గుర్తించి కోర్టు ఏజీపీగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బాధితులకు న్యాయం చేసేందుకు గాను బాధ్యాతాయుతతో కృషి చేస్తాననీ వెల్లడించారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

మామడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ సాంగ్వి గ్రామానికి చెందిన ఆలకుంట గంగాధర్(42) బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి గంగాధర్ మతిస్థిమితం లేకపోవడం అదే విధంగా రెండు నెలల క్రితం కూతురుకు విడాకులు కావడంతో మనస్తాపం చెంది భార్య తన పుట్టింట్లో ఇబ్రహీం పట్నం మండలం గోదూరు గ్రామంలో ఉంటుంది. కొద్ది రోజుల క్రితమే భర్త కూడా స్వగ్రామానికి తిరిగి వచ్చి కూతురు విషయంలో తాగుడికి బానిసై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్ల, భార్య ఉన్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తోడ్పాటునందించాలి

ఖానాపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలని మాదక ద్రవ్యాల నిరోధక అధికారి రాజశేఖర్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ బాలుర పాఠశాల అండ్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'

నిర్మల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా, (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రాజన్న తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో గల బీడీ ఫ్యాక్టరీలో సమ్మె నోటీస్ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి, కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకుందన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తూ డీజీల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర సరుకుల తదితర ధరలను పెంచుతున్నారన్నారు.


ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

● ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా


వంట గదిని పరిశీలిస్తున్న పీవో కుష్బూ గుప్తా

నిర్మల్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూగుప్తా ఆకస్మికంగా సందర్శించారు. వంటగది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించి పీవో అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలికసదుపాయాలు, భోజన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని పీవో ఆదేశించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న రావుల రాంనాథ్

నిర్మల్‌రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావుని హైదరాబాద్‌లో తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కే. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు

నిర్మల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈదిగాంలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేసినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు తెలిపారు. ఒకటో తేదీన నిర్వ హించిన వ్యాసరచన పోటీల్లో పూజ, నిఖిత, డ్రాయింగ్ పోటీల్లో రాణి, వి. అక్షర ప్రతిభ చూపారని వీరికి గురువారం బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు.



నేడు ఆర్జీయూకేటీ ఐటీ ఎంపిక జాబితా విడుదల

బాసర, జూలై3 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల జాబితాను శుక్రవారం విడుదల కానుంది. సాయంత్రం 3:30 గంటలకు వీసీ ప్రొ. గోవర్ధన్ విడుదల చేయనున్నారు. బాసర క్యాంపస్ 1500 సీట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటుచేసే సెంటర్‌లో 180 సీట్లకు సంబంధించిన 1680 విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఏసీ.ఇన్ జాబితాను విద్యార్థులు వారి తల్లిదండ్రులు వివరాలు తెలుసుకోవచ్చు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఇందిరా సౌర గిరిజన వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేయండి: కలెక్టర్

నిర్మల్ రూరల్, జూలై3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలుచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) కుష్బూ గుప్తా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకం కింద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు ఉచితంగా బోర్లు తవ్వించి, సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనిద్వారా గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం లభించడంతోపాటు వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వ్యవసాయ అవసరాల కోసం నీటి వనరుల అభివృద్ధికి ఈపథకం ఎంతగానో తోడ్పడుతుందని, ప్రతీ హబిటేషన్‌కు తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పథకం అమలులో భాగంగా మండల స్థాయిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో 9మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, అలాగే నియమనిబంధనలపై అధికారులు పూర్తిఅవగాహన కలిగి ఉండేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని, కమిటీలు అర్హులను గుర్తించి వారికి తగిన పరికరాలు అందజేయాలన్నారు. సాగునీటి సదుపాయం కలిగిన రైతులు వాణిజ్య పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎఫ్‌వో నాగిని భాను, జడ్పీ సీఈవో గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



చేపల వేటపై నిషేధాస్త్రం

- గోదావరి నది పరివాహానికి వర్తింపు
- ఎస్సారెస్పీ, కడెం రిజర్వాయర్‌లలో చేపలు పట్టవద్దంటూ ఆదేశాలు
- రెండు నెలల పాటు నిషేధం అమలు
- చేపలు గుడ్లు పెట్టే సమయం
- పరివాహక ప్రాంతాల్లో నిషేధంపై అధికారుల ప్రచారం

నిర్మల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదితోపాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టులలో చేపల వేటపై నిషేధం విధిస్తూ మత్స్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత జూలైతో పాటు రాబోయే ఆగస్టు ఆఖరి వరకు ఈ నిషేధాన్ని కొనసాగించనున్నారు. మంగళవారం నుంచి ఈ నిషేధం మొదలైంది. కాగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు రెండు నెలలపాటు తమ చేపల వేటను నిలిపివేయాలని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీనికోసం గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లోనే కాకుండా శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు పరివాహక గ్రామాల్లో కూడా చేపల వేటను రెండు నెలల పాటు కొనసాగించవద్దంటూ పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. దీనికి సంబంధించి మత్స్య సహకార సంఘాలకు సంబంధిత శాఖ అధికారులు నిషేధానికి సంబంధించి సమాచారం అందించారు. ప్రస్తుతం గోదావరి నదితో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇటు నిర్మల్ జిల్లా మత్స్యకారులతో పాటు అటు నిజామాబాద్ జిల్లా మత్స్యకారులు సైతం చేపల వేట కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే ఈ నిషేధం రెండు జిల్లాలకు వర్తించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తమ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా చేపల వేట కొనసాగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాగే వారి వేట పరికరాలు రవాణాకు ఉపయోగించే వాహనాలతోపాటు వేటాడిన చేపలను సైతం సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

చేపలు గుడ్లు పెట్టే సమయం ఇది

జూలై, ఆగస్టు మాసాల్లో వర్షాల కారణంగా నదులలోను, ప్రాజెక్టులలోను భారీ నీటి ప్రవాహం పెరగడంతో తల్లి చేపలు సహజ సిద్ధంగా ప్రేరణ చెంది కోట్ల సంఖ్యలో గుడ్లు పెడతాయని అధికారులు వివరిస్తున్నారు. ఈ గుడ్లు పొదిగిన అనంతరం చిచ్చురు చేపలు బయటకు వస్తాయని పేర్కొంటున్నారు. దీంతో చేపల సంఖ్య గణనీయంగా పెరుగుతుందంటున్నారు. ఈ రెండు నెలల్లో మత్స్యకారులు తల్లి చేపలను వేటాడినట్లయితే అవి చనిపోతాయని దీంతో అవి గుడ్లు పెట్టి పొదిగే అవకాశాన్ని కోల్పోతాయని అధికారులు చెబుతున్నారు. దీని కారణంగా చేపల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి ఉత్పత్తి పూర్తిగా పడిపోతుందని పేర్కొంటున్నారు. చేపలు లభించక మత్స్యకారులు ఉపాధి కోల్పోతారని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధిపై దృష్టి

జూలై, ఆగస్టు నెలలో గోదావరి నదితో పాటు వివిధ ప్రాజెక్టులలో చేపల వేటపై నిషేధం కొనసాగనున్నందున మత్స్యకారులు ప్రత్యామ్నాయ చేపల అమ్మకాలపై దృష్టి సారిస్తున్నారు. కాగా గత కొంత కాలం నుంచి నిర్మల్ జిల్లాలో పెద్ద ఎత్తున ఫిష్ పాండ్‌లలో చేపల పెంపకం కొనసాగుతోంది. చాలా మంది రైతులతో పాటు ఇతర వ్యాపారులు సైతం తమ వ్యవసాయ క్షేత్రాలలో ఫిష్ పాండ్‌లను ఏర్పాటు చేసి చేపల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. గోదావరితో పాటు ప్రాజెక్టులలో చేపల వేటపై నిషేధం కొనసాగుతున్న కారణంగా మత్స్యకారులు తమ ఉపాధి కోసం చేపల పాండ్‌ల నుండే చేపలను తీసుకొచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



తరగతి గదిలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రామారావు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

లక్ష్మణచాంద, జూలై3 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని డీఈవో రామారావు అన్నారు. మండలంలోని పీచరలో గల ప్రభుత్వ పాఠశాలలను ఆయన గురువారం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషితో బడిబాట కార్యక్రమంలో భాగంగా గతేడాది కంటే ఈ ఏడాది 20మంది పిల్లలు అధికంగా చేరారని అన్నారు. పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రాం డిజిటల్ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. 1వ తరగతిని పరిశీలించిన ఆయన ఆటపాటలతో విద్యార్థులకు బోధించిన తీరును గమనించి ఉపాధ్యాయురాలిని అభినందించారు. అలాగే పాఠశాలకు సంబంధించిన రికార్డులన్నీ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ లింబాద్రి. మండల విద్యాధికారి అశోక్ వర్మ, జడ్పీహెచ్ఎస్ లక్ష్మణచాంద కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, ప్రాథమిక పాఠశాల పీచర హెచ్ఎం దాసరి శంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తానూర్ ఎస్సైగా షేక్ జుబేర్

తానూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తానూర్ నూతన ఎస్సైగా షేక్ జుబేర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు భైంసాటౌన్‌లో ట్రైయినీ ఎస్సైగా పనిచేసిన షేక్ జుబేర్ బదిలీపై తానూర్ మండల ఎస్సైగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

నిర్మల్ రూరల్, జూలై3 (ఆంధ్రజ్యోతి): బాలశక్తి కార్యక్రమం కింద గురువారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, పొదుపు అలవాట్లు వంటి అంశాలు ఆర్థిక అక్షరాస్యతలో భాగమని వివరించారు. బ్యాంకుల్లో వాడే వివిధ ఫారముల వాడుక, రుణాల ప్రక్రియ, సిబిల్ స్కోర్ ప్రాముఖ్యత, విద్య, వాహనం, గృహ రుణాల అవసరాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, మిషన్ సాథి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సబిత, మౌనిక, ఉపాధ్యాయులు రమేష్ గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాల, ఊల్లె పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఖానాపూర్, జూలై3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల ముత్యాల, ఊల్లెపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా సాగాయి. రెండు రోజులపాటు సాగనున్న ఈ వేడుకల్లో గురువారం ఉత్తరవాహిని గోదావరి నది తీరం నుంచి నది జలాలను తెచ్చి అమ్మవారికి భక్తులు వైభవంగా జలాభిషేకం నిర్వహించారు. నది జలాల సేకరణకు భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరి నది నుంచి జలాలను సేకరించి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తరలి వచ్చారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు పరిమి సురేష్, మాజీ కౌన్సిలర్ పరిమి లత దపంతులు సహా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గంగా జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు

ఆర్జీయూకేటీలో కార్మిక శాఖ అధికారి విచారణ

- పెండింగ్ జీతాల చెల్లింపు
- 7వ తేదీలోగా 18 నెలల ఏడీఏ చెల్లింపునకు ప్రైవేటు సంస్థ అంగీకారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపడుతున్న కార్మికులు



కార్మికులకు మద్దతుగా నిరసనలో బీజేపీ నాయకులు

బాసర,జూలై3 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటిలో కార్మికుల సమస్యలకు మోక్షం లభిస్తోంది. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం, గురువారం రెండు రోజుల పాటు వచ్చిన వరుస కథనాలకు స్పందించిన కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యంరెడ్డి గురువారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు, పారిశుధ్య నిర్వహణ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న మే నెలకు సంబంధించిన జీతం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రంలోగా మే నెలకు సంబంధించిన జీతాలనుకార్మికులకు సంస్థ చెల్లించనున్నారు. ఇక దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న వీడీఏ చెల్లింపులకు కూడా సంస్థతో మాట్లాడి అసిస్టెంట్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. చర్చల ఫలితంగా 7వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న వీడీఏ మొత్తం కార్మికులకు చెల్లించనున్నట్లు సంస్థ హామీ ఇచ్చినట్లు ముత్యంరెడ్డి తెలిపారు. దీంతోపాటు కార్మికులకు పే స్లిప్పులతో వేతనాలు చెల్లించేలా ఆదేశాలిచ్చారు. కార్మికులకు సమస్యలు లేకుండా చూడాలని ప్రైవేటు సంస్థను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ చొరవతో కార్మికుల దీర్ఘకాల సమస్యలన్నీ కొలిక్కి వచ్చాయి.

కార్మికుల నిరసన

సమస్యలను పరిష్కరించాలని కార్మికులు గురువారం మరోసారి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఎదుట నిరసన తెలిపారు. విధుల హాజరుకాకుండా ప్రధానగేటు వద్ద బయట నుంచి ధర్నాచేశారు. పెండింగ్ వీడీఏ చెల్లించాలని, పే స్లిప్పులను ఇవ్వాలని ప్రతీనెల సమయానికి వేతనాలు చెల్లించాలని డిమాండ్‌లతో ఆందోళన చేపట్టారు. వీరికి బాసర బీజేపీ మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, నాయకులు రమేశ్ మద్దతు తెలిపి కార్మికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు.

కేజ్‌వీల్‌ను రోడ్డుపై నడపొద్దు: ఎస్సై

లోకేశ్వరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్‌ను రోడ్డుపై నడపొద్దని, కేజ్‌వీల్ ఎక్కించే ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసుకోవాలని లోకేశ్వరం ఎస్సై అశోక్‌కుమార్ అన్నారు. గురువారం అబ్దుల్లాపూర్ గ్రామంలో కేజ్‌వీల్ ఎక్కించే ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్లతో రోడ్లు చెడిపోతున్నాయని అన్నారు. గ్రామస్థులు కేజ్‌వీల్ ఎక్కించే ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్

కుంటాల, జూలై3 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దని, విక్రయస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కమల్ సింగ్, వ్యవసాయాధికారి విక్రమ్ దుకాణ నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం కుంటాలతో పాటు పలు గ్రామాలలో ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువులను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో దుకాణ దారుల నుంచి ఒరిజినల్ రశీదులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

కుంటాల, జూలై3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు - కుంటాల రహదారిపై అందకూర్ మూల మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు రోడ్డు పక్కన కాలువలోకి దూసుకపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఒకరికి స్వల్పగాయాల్యయాయి. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం గొల్లమాడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి పనుల నిమిత్తం భైంసా వెళ్లి తిరిగి గొల్లమాడ వెళుతుండగా మూలమలుపు వద్ద అకస్మాత్తుగా కారు అదుపుతప్పి పక్కనున్న కాల్వలోకి దూసుకెళ్లింది.



అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు

అనంతపేట్‌లో కార్డన్ సెర్చ్

- కారు, 65 బైకులు, నాలుగు ఆటోలు, మూడు ట్రాక్టర్లు, స్వాధీనం



పోలీసుల తనిఖీలో పట్టుబడిన ధ్రువపత్రాలు లేని వాహనాలు



మాట్లాడుతున్న రూరల్ సీఐ కృష్ణ

నిర్మల్ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపేట్ గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు రూరల్ సీఐ కృష్ణ తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 65 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, మూడు ట్రాక్టర్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సైబర్ క్రైమ్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డుభద్రత, సీసీ కెమెరాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై లింబాద్రి, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, నర్సాపూర్ ఎస్సై గణేష్, దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిగ్వా గ్రామస్థులతో మాట్లాడుతున్న బోస్లే నారాయణరావ్ పాటిల్

అర్హులకు అన్యాయం జరిగితే సహించం

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, జూలై3 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అర్హులకు అన్యాయం జరిగినా, అనర్హులకు చోటుదక్కినా సహించేది లేదని ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పేరులేని పలు ప్రాంతాల్లోని నియోజక వర్గవాసులు భైంసాలో మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అన్నివిధాలుగా అర్హులమైన తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేల ఆయా ప్రాంతాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అర్హులకే స్థానం ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుభీర్ మండలంలోని నిగ్వా వాసులు తమ గ్రామానికి నూతన రోడ్డు నిర్మింప చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరిచాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి ఇవ్వాలని సూచించారు.

- ఖర్గే సభను విజయవంతం చేయాలి

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావ్ పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు పార్టీ ప్రతినిధులతో సమీక్షించారు. సభ గురించి క్షేత్రస్థాయిలో గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో భారీ వర్షం

నిర్మల్‌రూరల్, జూలై3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.



కుంటాలలో జలమయమైన కాలనీ

కుంటాలలో..

కుంటాల: కుంటాలలో గురువారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి ప్రధాన వీధులు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

కుభీర్, జూలై3 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవమనుగడకు చెట్లే ఆధారమని వివరించారు.

చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్

కుంటాల, జూలై3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి ఓ మహిళ మెడలోంచి చైను చోరీకి యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నేరస్థుడి బైకు నెంబరు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసులు వ్యక్తిని పట్టుకొని గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.